# నెగెటివ్

నోబెల్ ప్రైజ్ అందుకుని కొన్ని నెలలు గడిచినా ఆ అనుభూతి యిప్పటికీ ఫ్రెష్‌గా, ఉత్తేజకరంగా, అద్భుతంగా అన్పిస్తోంది ప్రముఖ శాస్త్రవేత్త భార్గవ్‌కి. భారతీయ శాస్త్రవేత్తలు క్లోనింగ్ ద్వారా గరిమ అనే లేగదూడను సృష్టించిన పాతికేళ్ళకు భార్గవ్ తన మేథాశక్తి నుపయోగించి మానవక్లోనింగ్‌లో విజయాన్ని సాధించాడు.

తన టీంలోని శాస్త్రజ్ఞులందరూ అత్యంత ప్రతిభా సంపన్నులు కావటం తన అదృష్టం అనుకున్నాడు భార్గవ్. ఎటొచ్చీ డాక్టర్ భానుమూర్తి తనతో విభేధించి విడిపోవటమే బాధకలిగించింది.

ఎన్నాళ్ళ సాహచర్యం యిద్దరిదీ! ఒకే వూరు... ఒకే స్కూల్లో చదువుకున్నారు. యిద్దరూ ఆంధ్రా యూనివర్శిటీ నుండి బయోకెమిస్ట్రీలో యంయస్సీ చేసి, అమెరికాలో రీసెర్చ్ చేశారు.

క్లోనింగ్ అంటే అమితాసక్తి కన్పరిచిన భానుమూర్తి మానవ క్లోనింగ్‌కి మాత్రం బద్ధ వ్యతిరేకిగా మారటమే తనకు కొరుకుడు పడని విషయం.

పదేళ్ళ క్రితం మానవ క్లోనింగ్ ప్రాజెక్ట్ ప్రారంభించిన రోజు తనకూ డాక్టర్ భానుమూర్తికీ మధ్య జరిగిన వాగ్యుద్ధం గుర్తొచ్చింది.

"యిన్నేళ్ళ మన కల సాకారం చేసుకోడానికి ప్రభుత్వం కూడా సహకారం అందిస్తున్నందుకు సంతోషపడక ఈ ప్రాజెక్ట్ నుండి వైదొలుగుతాననటం నీకు భావ్యంగా ఉందా మూర్తీ? నాకైతే నీ ప్రవర్తన అర్థ రహితంగా అన్పిస్తోంది" అన్నాడు.

"అంతరించిపోతున్న జీవజాతుల్ని పరిరక్షించుకోడం క్లోనింగ్ వల్ల సాధ్యపడ్తుందన్న నమ్మకంతో నేనీ ప్రాజెక్ట్ కోసం అహర్నిశలూ శ్రమపడ్డాను. మానవుల గర్భస్థ పిండం నుంచి వేరు చేసిన మూలకణాలతో గుండె,

మూత్రపిండాలు, కాలేయం వంటి అవయవాల్ని వృద్ధి చేసి, అవయవదానం కోసం ఎదురుచూస్తున్న వేలాది రోగులకు ప్రాణదానం చేయవచ్చన్న సదుద్దేశంతో నీతో చేతులు కలిపాను. కానీ క్లోనింగ్ ద్వారా మనిషిని సృష్టించడాన్ని మాత్రం నేనొప్పుకోను"

"అదే నాకు వింతగా తోస్తోంది. మనం శాస్త్రవేత్తలం. జీవ రహస్యాల్ని, సృష్టి రహస్యాల్ని ఛేదించటమే మన పని. స్త్రీ పురుషుల సంయోగంతో పని లేకుండా, పునరుత్పత్తికోసం అవసరమైన అండం, రేతస్సుల కలయికతో సంబంధం లేకుండా, మానవ శరీరంలోని ఏ భాగంలోంచైనా కణ జాలాన్ని సేకరించి మరో మనిషిని సృష్టించటం ఎంత గొప్ప విషయం! సృష్టికి ప్రతి సృష్టి చేసిన విశ్వామిత్రుడిలా మనమూ మనుషుల్ని సృష్టించ గలిగితే... ఓహ్! ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నాను. అదే సాధ్యమైన రోజు మనమే సృష్టికర్తలం... దేవుళ్ళం" అన్నాడు. ఆ వూహకే మనసంతా మత్తులోకి జారుకున్న భావన.

"మనం ఏం చేసినా అది సమస్త మానవాళికి మంచి చేసేలా ఉండాలి. కొండల్ని తొలిచి రహదారులు నిర్మించడానికి ఉపయోగపడ్తుందని కనుక్కున్న డైనమిట్ మానవ విధ్వంసానికి విపరీతంగా వాడబడింది. మానవ క్లోనింగ్ వల్ల మనం వూహించని అనర్థాలు జరిగే అవకాశం ఉంది. మనుషుల ప్రతిరూపాల్ని తయారు చేయటం వల్ల ఎన్ని సమస్యలొస్తాయో వూహించావా? స్త్రీ పురుషుల సమాగమంతో సంబంధం లేకుండా పిల్లలు కలిగితే అది మానవ సంబంధాల్ని ఎంతగా విచ్ఛిన్నం చేస్తుందో ఆలోచించావా?"

"శాస్త్రపరిశోధన ఎప్పుడూ పాజిటివ్ దృక్పథంతోనే జరగాలి. అల్పాయుష్షుతో తనవాళ్ళు చనిపోయినప్పుడు మనుషులెంతటి క్షోభని అనుభవిస్తారో నీకు తెలీదా? అర్ధాంతరంగా తనువు చాలించిన వ్యక్తుల రూపరేఖల్తో మనుషుల్ని సృష్టించి ఆ కుటుంబానికి సంతోషాన్ని అందించవచ్చని ఎందుకు ఆలోచించవూ"

"నీ ప్రయోగాలు సత్ఫలితాలనిచ్చినా వాటిని మనుషులు దుర్వినియోగం చేయరన్న గ్యారంటీ ఏముంది? నువ్వు దేవుడి అవతారం ఎత్తే కలలు కంటున్నావు. కొంతమంది వాటినడ్డం పెట్టుకుని సైతాన్‌లా మారిపోతేనో...

మానవ మేధలోంచి విశ్వ శ్రేయస్సు కాంక్షించే రుష్యత్వమే కాదు, ప్రళయ విధ్వంసాన్ని సృష్టించే మృగత్వం, పచ్చి నెత్తురు తాగే రాక్షసత్వం కూడా ఉద్భవిస్తాయి. అణు విచ్ఛిత్తి వల్ల అనంతమైన శక్తి జనిస్తుందనీ, దాన్ని మానవాళి అభ్యున్నతికి వాడొచ్చని, ఆ విషయాన్ని కనుగొన్న కొత్తలో సంబరపడ్డారు. కానీ దాని పర్యవసానం ఆటం బాంబులా మారి రెండు పట్టణాల్నే సమూలంగా నాశనం చేసింది"

"నీ ఆలోచనా ధోరణి వక్రమార్గంలో నడుస్తోంది మూర్తీ" అన్నాడు తను.

"లేదు. నేను సవ్యంగానే ఆలోచిస్తున్నాను. నీ పరిశోధనే వక్రమార్గం పట్టే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నాను. మనిషిని పోలిన మనిషిని సృష్టించే క్రమంలో ఫ్రాంకెన్‌స్టీన్‌లాంటి రాక్షసులు పుట్టుకొచ్చే ప్రమాదం ఉంది. మానవ జన్యువు మ్యుటేట్ అయి వింత మృగాలు పుడ్తే అప్పుడు మానవ మనుగడకు రక్షణ కరువౌతుంది"

"నీవన్నీ అర్థం లేని భయాలు. యిలా ఐతే శాస్త్ర పరిశోధనే ఆపేయాలి. కొత్త విషయాలు కనుగొనే క్రమంలో కొంత యిబ్బంది తప్పదు. మనిషిని బతికించుకోడానికి విషపూరితమైన అవయవాన్ని ఖండించక తప్పదు."

"అక్కడే నేను విభేదించేది. శాస్త్ర విజ్ఞానం యింతగా అభివృద్ధి చెందాక ఆ విషాన్ని తొలగించగలగాలిగాని అవయవాన్ని ఖండించటం పరిష్కారం కాకూడదు. నేనీ రోజు నుంచీ మానవ క్లోనింగ్ సుసాధ్యం చేయడానికి నువ్వేసే ప్రతి అడుగునీ అడ్డుకుంటాను. నా సర్వ శక్తుల్నీ ఒడ్డి, వికృత రూపాల్తో వికృత మనస్తత్వాలతో మానవ ఆవిర్భావం జరగడానికి అవకాశాన్ని కల్పించే నీ ప్రయోగాల్ని తిప్పి కొడ్తాను. గుర్తుంచుకో" అంటూ డాక్టర్ భానుమూర్తి కోపంగా వెళ్ళిపోయాడు.

భార్గవకి మూర్తిని తల్చుకుని జాలేసింది. ఓ గొప్ప అవకాశాన్ని చేతులారా జారవిడుచుకున్నాడు. తనతో ఈ పదేళ్ళు కలిసి పన్చేసి ఉంటే యిద్దరికీ కలిపి నోబెల్ ప్రైజ్ ప్రకటించేవారు. నోబెల్ బహుమతి గ్రహీతగా ప్రపంచం నిండా అతని పేరు మార్మోగేది. పాపం దురదృష్టవంతుడు... అనుకున్నాడు.

తన పరిశోధనా సంస్థకి బయల్దేరబోతున్న సమయంలో కాలింగ్ బెల్ మోగితే ఆలోచనల్లోంచి బైట పడి, తలుపు తెరిచి చూశాడు. ఎదురుగ్గా పాతికేళ్ళ యువతి... చేతుల్లో నాలుగేళ్ళ బాబు... కొన్ని నిముషాల ముందే చనిపోయినట్లున్నాడు... మొహంలో యింకా మృత్యు కళ రాలేదు.

ఆమె కన్నీళ్ళతో అతని పాదాల్ని కడిగింది. "నాకు ఒక్కగానొక్క కొడుకు. రెండేళ్ళ క్రితమే నా భర్త మమ్మల్ని వదిలేసి యింకొకరితో వెళ్ళిపోయాడు. వీణ్ని చూసుకునే బతుకుతుంటే కొత్త వైరస్ ఏదో సోకి నా కొడుకు చనిపోయాడు. నాకు నాకొడుకు కావాలి. మీరు దేవుడితో సమానమని విన్నాను. నా బాబుని నాకు తిరిగి ప్రసాదించండి" అని వేడుకుంది.

ప్రయోగశాలలో తను విజయవంతంగా క్లోనింగ్ ద్వారా మానవ పిండాన్ని సృష్టించగలిగాడు. యిప్పుడు తనకో అవకాశం వచ్చింది. ఈ బాబుని పోలిన మరో బాబుని సృష్టించే అవకాశం... తనని తాను దేవుడిగా రుజువు చేసుకునే అవకాశం... కనీసం విశ్వామిత్రుడంతటి శక్తిమంతుణ్ణని నిరూపించుకునే అవకాశం...

భార్గవ దివారాత్రాలు శ్రమించాడు. పట్టుదల సడలకుండా తన అనుభవాన్నంతా జోడించి, చివరకి బాబులాంటి మరో బాబుని సృష్టించాడు. ప్రెస్ మీట్ పెట్టి అనంత వాహినిలా కదిలొచ్చిన జన సమూహం కరతాళ ధ్వనుల మధ్య తను పున: సృష్టి చేసిన నాలుగేళ్ళ బాబుని ఆమె తల్లికి అందించాడు. అప్పుడా తల్లి కళ్ళలోని ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని చూసి తన జన్మ ధన్యమైందనుకున్నాడు. ఆ సమయంలో భానుమూర్తి ఎదురుగా ఉండి ఉంటే, తన వాదన ఎంత తప్పో తెల్సుకుని పశ్చాత్తాప పడి ఉండేవాడు అన్పించింది.

భార్గవ ఆ జన సమూహంలో భానుమూర్తికోసం ఆశగా వెదికాడు. కన్పించలేదు. యిక్కడ ప్రస్తుతం లేకున్నా టీవీలో తప్పకుండా యిదంతా చూస్తూ ఉంటాడన్న నమ్మకం... తన ఖ్యాతిని చూసి ఈర్ష్య పడ్తుంటాడా? తను చేజేతులా అవకాశాన్ని పోగొట్టుకున్నందుకు బాధ పడ్తుంటాడా? లేక తన మిత్రుడికి పట్టిన భోగాన్ని చూసి సంతోష పడ్తుంటాడా?

టీవీ మీడియాకి, ప్రింట్ మీడియాకి యింటర్వ్యూలు యిచ్చీ యిచ్చీ అలసి పోయి యింటికొచ్చిన భార్గవ, షవర్ స్నానంతో సేదదీరి వచ్చేప్పటికే సుకేశిని వేడివేడిగా అన్నం వడ్డించింది. సుకేశినికి తన భర్తకు ఏవిష్టమో బాగా తెలుసు. ఆ పదార్థాల్ని రుచిగా వండటం యింకా బాగా తెలుసు.

"మీ అంతటి గొప్ప శాస్త్రవేత్త నా భర్త కావటం గర్వంగా ఉంది. ఈ రోజు మిమ్మల్ని టీవీల వాళ్ళు, న్యూస్ పేపర్ల వాళ్ళు అపర బ్రహ్మ అంటూ పొగుడ్తుంటే పులకించిపోయాను తెలుసా?" అంది అర్ధ నిమీలిత నేత్రాలతో.

"అంత మంది ముందు చెప్పటం బాగోదని చెప్పలేదుకానీ నా విజయాలన్నీ నీకేగా అంకితం... ఎంత గొప్ప ప్రేమ నీది! నువ్వు, నీ అనురాగం, నీ సహకారం లేకుండా నేను లేను. నీలాంటి అద్భుత సౌందర్యరాశి, అమోఘమైన తెలివి తేటల్తోపాటు అనంతమైన ప్రేమామృతాన్ని కలిగి ఉన్న నీలాంటి అపురూపమైన స్త్రీ నా భార్య కావటం నా అదృష్టం" అన్నాడతను సుకేశిని వైపు ఆరాధనగా చూస్తూ.

అతనికి సుకేశిని అంటే పిచ్చి ప్రేమ. సైన్సుని ప్రేమించక ముందే సుకేశినిని ప్రేమించాడు. శాస్త్రీయ పరిశోధన... సుకేశిని... ఈ రెండింట్లో ఏదో ఒకదాన్నే కోరుకోమంటే మరో ఆలోచన లేకుండా సుకేశినినే కోరుకుంటాడు. ఈ కీర్తీ, నోబెల్ ప్రైజూ, శాస్త్రవేత్తగా దొరికిన సంతృప్తీ... యివన్నీ సుకేశిని ముందు గడ్డిపోచల్లా కన్పిస్తాయి. సుకేశిని తన ప్రాణం...

రాత్రి పడుకునే ముందు కొద్దిసేపు లైబ్రరీలో గడపటం అలవాటు. పడక్కుర్చీలో పడుకుని జెనెటిక్స్‌కి సంబంధించిన పుస్తకం చదువుతున్న భార్గవ అలికిడైతే తలయెత్తి చూసాడు.

ఎదురుగ్గా భానుమూర్తి....

"ఓ నువ్వా... పర్సనల్‌గా కంగ్రాట్స్ చెప్పడానికొచ్చావా" అన్నాడు భార్గవ.

"లేదు. నిన్ను హెచ్చరించిపోదామని వచ్చాను" కుర్చీ లాక్కుని కూచుంటూ అన్నాడు భానుమూర్తి.

"నువ్వు మారి ఉంటావనీ, పశ్చాత్తాప పడ్తూ ఉంటావని అనుకున్నాను.

చనిపోయిన తన కొడుకుని ముమ్మూర్తులా పోలిన బాబుని ఎత్తుకున్నప్పుడు ఆ తల్లి తడి కళ్ళలో మెరిసిన కృతజ్ఞతాభావం నువ్వు చూసి ఉంటే యిలా మాట్లాడవు"

"నీ పరిజ్ఞానాన్ని ఎలాగోలా సంపాయించో, తస్కరించో బతికున్న మనుషుల్ని పోలిన మనుషుల్ని తయారు చేస్తే ఎన్ని ఉపద్రవాలు జరుగుతాయో వూహించావా?"

"ఒకవేళ అలా జరిగినా ఎటువంటి ఘోరాలూ జరగవు. ఎందుకంటే ఎవరు అసలో ఎవరు నకిలీనో యిట్టే కనిపెట్టవచ్చు కాబట్టి"

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?"

"రూపు రేఖలు అచ్చు గుద్దినట్లున్నా మెదళ్లో ఏ రకమైన జ్ఞాపకాలూ నిక్షిప్తమై ఉండవు కాబట్టి. అసలు వ్యక్తి తన వాళ్ళని గుర్తు పట్టగలడు. జరిగిపోయిన విషయాల్ని గుర్తుకు తెచ్చుకుని చెప్పగలడు. అదే క్లోనింగ్ వల్ల తయారుచేసిన వ్యక్తి మెదడు ఆ క్షణంనుంచే సంఘటనల్ని రికార్డు చేయటం ప్రారంభిస్తుంది. గతానికి సంబంధించి ఏ ఒక్క ప్రశ్న వేసినా అతను నకిలీ అని తేలిపోతుంది. వెరీ సింపుల్"

"అక్కడే పొరబడ్డావు. ప్రపంచంలో నీ అంత మేధావి లేడనే అహంకారమే నీ చేత యిలా మాట్లాడిస్తుంది."

"నేనలా ఎన్నడూ అనుకోలేదు. నాకు సమఉజ్జీవి నువ్వని తెలుసుకాబట్టి"

"ఏ వ్యక్తికి నకలు తయారుచేయాలనుకున్నామో ఆ వ్యక్తి మెదళ్లోని సమాచారాన్ని స్కాన్ చేసి, భద్రపర్చుకుని, క్లోనింగ్ ద్వారా అటువంటి వ్యక్తి రూపుదాల్చాక అతని మెదళ్లోకి ఆ సమాచారాన్ని కాపీ చేయటం ద్వారా అవే జ్ఞాపకాల్ని అందించొచ్చు. అదేమంత కష్టమైన విషయం కాదు. అప్పుడు ఎవరు అసలో ఎవరు నకిలీనో అసలుని సృష్టించిన బ్రహ్మగ్గానీ నకిలీని సృష్టించిన నీలాంటి అపర బ్రహ్మలగ్గానీ అంతుబట్టదు. తద్వారా పోట్లాటలు, గొడవలు, యుద్ధాలు, మారణహోమాలు జరగొచ్చు"

"నాన్సెన్స్... నీదంతా వితండవాదం"

"సరే. అలానే అనుకో. యిప్పటికైనా నీ తదుపరి పరిశోధనల్ని ఆపేయి. ఆ

బాబే క్లోనింగ్ ద్వారా సృష్టించిన చివరి మానవ ప్రాణి కావాలి"

"బెదిరిస్తున్నావా?"

"స్నేహితుడివి కాబట్టి నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తున్నాను"

"నువ్వు నా పేరు ప్రఖ్యాతులు చూసి ఓర్వలేని తనంతో దహించుకుపోతున్నావు"

"కాదు. మానవాళికి నీ వల్ల పెనుముప్పు రాకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నాను. అర్థం చేసుకోవేందుకు" అన్నాడు కోపంగా భానుమూర్తి.

"నీలాంటి వాళ్ళకి భయపడి నా పరిశోధనల్ని ఆపే ప్రసక్తే లేదు. నీ యిష్టమొచ్చింది చేసుకో. ఐ డోంట్ కేర్" భార్గవ కూడా కోపంగా సమాధానమిచ్చాడు.

"చివరిసారిగా చెప్తున్నా. నీ మంచికోరేవాడిగా చెప్తున్నా. ప్లీజ్ నామాటిను"

"నువ్వు కాదుకదా ఆ దేవుడే వచ్చి చెప్పినా వినను"

"సరే. నిన్నెలా ఆపాలో నాకు తెలుసు. గుడ్ బై" భానుమూర్తి విసురుగాలేచి, వేగంగా బైటికెళ్ళిపోయాడు.

భానుమూర్తి బెదిరించి వెళ్ళి సంవత్సరం దాటింది. అతని మేధోశక్తి ఏపాటిదో తెల్సినవాడు కాబట్టి భార్గవ కొన్నాళ్ళు అలజడికి, అశాంతికి లోనైనాడు. మిగతా మేధావుల్ని కూడగట్టి తన ప్రయోగాలకు వ్యతిరేకంగా ఉద్యమం లేవదీస్తాడేమోనని భయం... తన ప్రాజెక్ట్ని ధ్వంసం చేస్తాడేమోనని భయం. కిరాయి మనుషులద్వారా తనని ఎటాక్ చేసి, గాయపరుస్తాడేమోనన్న భయం... కానీ అతను భయపడినట్లు ఏమీ జరగలేదు.

మెల్లమెల్లగా భార్గవ ఆ విషయాన్ని మర్చిపోయి తన ప్రయోగాల్లో లీనమైపోయాడు. జెనీవాలో జరుగుతున్న ప్రపంచ దేశాల శాస్త్రజ్ఞుల సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని, తన ఉపన్యాసాన్ని విన్పించవల్సిందిగా ఆహ్వానం అందింది. అతని ప్రయాణానికి అవసరమైన వస్తువులు సమకూర్చటంలో, సామాన్లు సర్దటంలో నిమగ్నమైపోయింది సుకేశిని.

"నువ్వూ రాకూడదా?" ఆ రోజుకి భార్గవ అలా అడగటం పదోసారి.

"చెప్పాగా. విపరీతమైన వీపు నొప్పి. కొద్దిసేపు కూచున్నా తట్టుకోలేకుండా ఉన్నాను. అంతంత దూరం ప్రయాణం చేయలేను. ప్లీజ్... ఈ ఒక్కసారికి వెళ్ళిరండి" అందామె.

"ఇదేమైనా ప్రతి యేడూ వచ్చే అవకాశమనుకుంటున్నవా మరోసారికి నువ్వు రావడానికి? చాలా అరుదైన గౌరవం తెలుసా?" అన్నాడు.

"భార్గవకూడా చాలా అరుదైన వ్యక్తి తెలుసా? యిలాంటి గౌరవాలు ముందు ముందు మరిన్ని లభిస్తాయి" అంది తన అందమైన కనురెప్పల చాటున కళ్ళలోని కొంటె తనాన్ని దాచుకుంటూ.

"తీయటి మాటల్తో మురిపించటం కాదు. నీకు తెల్సుగా... నువ్వు పక్కన లేకపోతే చాలా అశాంతికిలోనౌతా. ప్లీజ్ రావా?"

"సారీ... నొప్పిని తల్చుకుంటేనే వళ్ళు జలదరిస్తోంది. నేను రాలేను."

"సర్లే. నీకు వెన్నెముకలో ప్రాబ్లం ఉన్నట్టుంది. కొన్ని వెన్నుపూసలు అరిగిపోయి ఉంటాయి. నేను తిరిగొచ్చాక క్లోనింగ్ ద్వారా కొత్త వెన్నుపూసలు తయారుచేసి అమరుస్తాను." అన్నాడు.

సుకేశిని తన భర్త వైపు మురిపెంగా చూసింది.

మరునాడు భార్గవ జెనీవాకి ప్రయాణమైనాడు. వెళ్ళిన క్షణం నుంచీ ఊపిరాడనంత పని... సదస్సులు...చర్చలు... యింటర్వ్యూలు...ఉపన్యాసాలు... మిగతా దేశాల శాస్త్రవేత్తలతో అభిప్రాయ భేదాలు... వాదోపవాదాలు... యిట్టే వారం జరిగిపోయింది. ఎంత బిజీగా ఉన్నా రోజుకు రెండు సార్లు సుకేశినితో మాట్లాడటం మాత్రం మర్చిపోలేదు.

ఆ రోజే తిరిగి వస్తున్నట్లు సమాచారం యివ్వటం వల్ల సుకేశిని భర్తకిష్టమైన వంటలు వండి, భార్గవ రాకకోసం ఎదురుచూస్తూ కూచుంది. కాలింగ్ బెల్ మోగటమే ఆలస్యం, ఒక్క పరుగున వెళ్ళి తలుపు తీసింది.

భార్గవ రాగానే సుకేశినిని దగ్గరకు తీసుకుని, "ఈ వారం రోజులూ నిన్నెంత మిస్సయ్యానో తెలుసా" అన్నాడు.

సుకేశిని హాయిగా నవ్వింది."మీ కాన్ఫరెన్స్ బాగా జరిగిందా... టీవీలో

బాగానే కవర్ చేశారు" అంది.

"చాలా బాగా జరిగింది. అది సరే. నీ వీపునొప్పి ఎలా ఉంది?" అంటున్నప్పుడు మరలా కాలింగ్ బెల్ మోగింది.

"ఈ టైంలో ఎవరై ఉంటారు?" భార్గవ భృకుటి ముడివేస్తూ అన్నాడు.

"నేను చూస్తానుండండి" అంటూ సుకేశిని తలుపు తీసింది. ఎదురుగా అచ్చం భార్గవలానే ఉన్న మనిషి నిలబడి ఉన్నాడు. సుకేశిని ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే అతను లోపలికి వచ్చి సుకేశినిని దగ్గరకు తీసుకుని, "ఈ వారం రోజులూ నిన్నెంత మిస్సయ్యానో తెలుసా? యింతకూ నీ వీపు నొప్పి ఎలా ఉంది" అన్నాడు.

సుకేశినికి ఏం జరుగుతుందో అర్థం కాలేదు. యిద్దరు భార్గవలెక్కడనుంచి వచ్చారు? యిందులో తన భర్త ఎవరు? మొదట వచ్చినతనా లేక యిప్పుడొచ్చినతనా?

భార్గవ, యింట్లో అప్పటికే తన భార్యతో మాట్లాడుతున్న మరో భార్గవని చూడగానే మొదట ఆశ్చర్యపోయాడు. తర్వాత కోపంతో మండి పడ్డాడు. యిదంతా ఏదో కుట్ర... కుతంత్రం... తనని యిబ్బంది పెట్టడం కోసం క్లోనింగ్ ద్వారా మరో భార్గవని సృష్టించి తన మీదకి ఉసిగొల్పారు. తాను జెనీవాలో జరిగిన సదస్సునుంచి తిరిగి రాగానే ఈ క్లోన్ కేటుగాణ్ణి తనకంటే కొన్ని నిముషాల ముందే తన యింటికి పంపించారు.

"చూడు మిస్టర్. నేనే అసలైన భార్గవని. నువ్వు క్లోనింగ్ ద్వారా జన్మించిన నా ప్రతి రూపానివి మాత్రమే. నా తెలివీ, విజ్ఞానం... నా మేధస్సూ .. వీటితో నువ్వు పోటీ పడలేవు. తొందరగా యిక్కడనుంచి వెళ్ళిపో. లేకపోతే నేనేం చేస్తానో నాకే తెలీదు" అన్నాడు కోపంగా.

యింట్లో ఉన్న భార్గవ ఆలోచనలు కూడా అచ్చం అలానే ఉన్నాయి. ఎవరీ ఆగంతకుడు? తన రూపంలో ఉన్నంత మాత్రాన తన స్థానాన్ని కాజేయటం సాధ్యమనుకొంటున్నాడా? తను జెనీవా కాన్ఫరెన్స్‌లో ఉన్న సమయంలో ఎవరో ప్లాన్ ప్రకారం తన రూపాన్ని క్లోనింగ్ ద్వారా సృష్టించారు. తను యింటికొచ్చిన

కొన్ని నిముషాల తర్వాత ఈ క్లోన్ భార్గవ కాలింగ్ బెల్ కొట్టాడు. తన ఆలోచనలు, జ్ఞాపకాలు, శాస్త్ర పరిజ్ఞానం... యివి చాలవా వీణ్ణి డూప్లికేట్‌గా పట్టివ్వడానికి... మూర్ఖుడు...

"ఒరే భార్గవ కాని భార్గవా... నేనేరా అసలు భార్గవని. నువ్వే క్లోన్‌వి. నిన్ను సృష్టించిన సైంటిస్ట్ ఎవరో గాని ఒక విషయాన్ని విస్మరించాడు. నీ మెదడు ఎన్నటికీ నా మెదడుతో సమానం కాజాలదు. నీమెదడు తెల్లకాగితంతో సమానం. మరి నాదో... అనంతమైన విషయ పరిజ్ఞానాన్ని, తెలివితేటల్ని నిక్షిప్త పర్చుకున్న సూపర్ బ్రెయిన్. నువ్వే వెళ్ళిపోతావా లేదా పోలీసుల్ని పిలవమంటావా" అన్నాడు రెండో భార్గవతో.

రెండో భార్గవ మరింత ఆశ్చర్యానికి, ఆందోళనకు గురైనాడు. ఈ మాటలన్నీ తను కదా చెప్పాలి. తనే కదా అసలైన భార్గవ. మరి క్లోన్ కాబడిన భార్గవ యిలా మాట్లాడుతున్నాడేమిటి? కొంపదీసి తన మెదళ్లోని సమాచారాన్ని కాపీ చేసి వాడి మెదళ్లోకి ఎక్కించారా? "సరే. నువ్వే అసలైన భార్గవ ఐతే జెనీవా కాన్ఫరెన్స్‌లో నా పక్కన కూచున్న జపాన్ శాస్త్రవేత్త చివర్రోజునాడు నా చెవిలో చెప్పిన విషయమేంటో చెప్పు" అన్నాడు మొదటి భార్గవతో.

"నీ చెవిలో చెప్పటమేమిటి? నాన్సెన్స్... నాచెవిలో కదా చెప్పింది." అంటూ అదేమిటో చెప్పాడు.

రెండో భార్గవ అయోమయంలో పడ్డాడు. అది చాలా క్లిష్టమైన శాస్త్ర పరిజ్ఞానానికి సంబంధించిన విషయం. మరి వీడు క్లోన్ ఐతే ఈ విషయం ఎలా చెప్పగలిగాడు? కాని అసలైన భార్గవ తనే కదా.

అతని మౌనాన్ని పరాజయంలా భావించి, మొదటి భార్గవ రెండో భార్గవని అడిగాడు. "నువ్వే నిజమైన భార్గవ ఐతే నేను జెనీవాకి వెళ్ళే ముందు రాత్రి నా భార్య నాతో ఏం మాట్లాడిందో చెప్పు చూద్దాం"

"నీతో మాట్లాడటమేంటి నాన్సెన్స్... అది నా ప్రాణంలో ప్రాణమైన సుకేశిని నాతో మాట్లాడిన అతి గోప్యమైన, భార్యాభర్తలకు మాత్రమే పరిమితమైన విషయాలు" అన్నాడు.

"నువ్వే నిజమైన భార్గవ అని రుజువు చేసుకోవాలంటే చెప్పక తప్పదు" అన్నాడు మొదటివాడు.

రెండో వాడు మొత్తం అక్షరం పొల్లు పోకుండా చెప్పాడు.

యిప్పుడు మొదటి భార్గవలో అనుమానం మొదలైంది. తనే కదా అసలు భార్గవ... మరి వీడు క్లోన్ ఐతే ఆ రాత్రి జరిగిన విషయాలన్నీ తనకే జరిగినట్లు ఎలా చెప్పగలిగాడు?

అతను మౌనంగా ఉండటం చూసి, "నేనే అసలు భార్గవని" అన్నాడు రెండోవాడు.

"కాదు. నేనే అసలు భార్గవని" అన్నాడు మొదటివాడు.

యిద్దరూ కలబడ్డారు.

మొదటివాడు మోసగాడు... తనే అసలైన భార్గవ. వాడు కాజేయడానికొచ్చింది డబ్బునో ఆస్తినో కాదు, తన అస్థిత్వాన్ని. తను అహర్నిశలూ శ్రమించి, సంపాదించుకున్న కీర్తికాంతని. తనకు ప్రాణప్రదమైన సుకేశినిని. వాణ్ణి చంపేస్తే తప్ప తనకు మనుగడ ఉండదు, మనశ్శాంతి ఉండదు అనుకున్నాడు రెండోవాడు. అదే సమయంలో మొదటి భార్గవ కూడా అచ్చం అలానే అనుకున్నాడు.

*(రచన మాసపత్రిక, డిసెంబర్ 2009)*

★ ★ ★